# అచలపతీ - అమితజీవి

ఎవరి సొద వాళ్ళు చెప్పుకోవడంలో ఓ సుఖం ఉంది. అవతలివాళ్ళకు తెలివిమాలిన పనుల్లా, తలతిక్క చేష్టల్లా కనిపించే మన పనుల వెనక ఎంతటి అద్భుతమైన ఆలోచనాపటిమ ఉందో, ఎంత బలీయమైన కారణాలు ఉన్నాయో మనం విశదీకరించవచ్చు.

నా సంగతే తీసుకోండి. బయటవాళ్ళ దృష్టిలో నేనొక పోతుటీగని, పెద్దలిచ్చిన ఆస్తిని అరగదీసి కరగదీస్తున్న సోమరిని; బాధ్యతలంటే భయంచేతనే బ్రహ్మచర్యం ఆశ్రయించినవాడిని; అచలపతి అండగా నిలవకపోతే అడుగు ముందుకు వేయలేని వాజమ్మని. కానీ నా దృష్టిలో నేను?– తక్కిన బుద్ధిహీనుల్లా ఆత్మస్తుతీ, పరనిందా చేసుకోకపోయినా వాస్తవాలు చెప్పేటప్పుడు నా గొప్పతనం ఎలాగూ దాగదు కదా – సరే అన్నీ ఒకేసారి ఏకరువు పెట్టడం ఎందుకు? నా కథలు చదువుతూంటే మీరే తెలుసుకుంటారు.

మఱ్ఱిచెట్టు క్రింద ఏదీ పెరగదని పెద్దలంటారు. పెరిగినా జనాలు దానికేసి చూడకుండా మఱ్ఱిచెట్టునే పట్టుకుని వేలాడుతారని నేనంటాను. అచలపతి తెలివైనవాడే. అంత మాత్రంచేత తక్కినవారందరూ, యజమానినయిన నాతో సహా చవటలని అర్థమా? కానీ అమాంబాపతు జనాభా చేష్టలు చూస్తే అలాగే అనిపిస్తుంది!

ఎందుకంటే ఆ రోజు మా ఇంటిపక్కాయన 'అచలపతిగారున్నారా?' అంటూ వచ్చినప్పుడు, 'అతడు లేడు, లోపలికి రండి' అని నేను సాదరంగా ఆహ్వానించినా, ఆయన పారిపోదామని చూశాడు– "అబ్బే, ఆయనతోనే పనిలెండి, ఏదో సలహా అడుగుదామనీ" అంటూ.

ఇక అచలపతి గురించి చెప్పక తప్పదు. సఖుడు, బంధువు, హితుడు... అంటూ




అర్జునుడిలా వర్ణించదగిన వాడు అచలపతి. అనాథగా మా నాన్న దగ్గర చేరాడు. ఆయనకు ఎడం భుజంగా (మా నాన్నగారిది ఎడం చేతివాటం) మెలిగాడు; ఆయనతో బాటు పల్లె నుండి టౌన్‌కి వచ్చాడు. ఏ పనైనా సరే నియమబద్ధంగా, 'పెర్‌ఫెక్ట్'గా చేసే మనిషి, అందుకే వెంకటాచలపతి అనే తన పేరును పొట్టిచేసి అందరూ 'చలపతీ' అని పిలుస్తుంటే 'చలపతి' అనే మాటకు అర్థం లేదనీ, 'అచలపతి' అనాలనీ అందర్నీ కరెక్ట్ చేసి అలాగే పిలిపించుకొంటాడు. అతనివి అమోఘమైన తెలివితేటలనీ, అతనికి తెలీనిది లేదనీ అతడిని తెలిసిన వాళ్లందరికీ పెద్ద నమ్మకం.

మా వాళ్లు కాలు మీద కాలు వేసుకుని తినేటంత కాసులు సంపాదించి ఇచ్చేరు కానీ కాలువేసి పెట్టే మనుష్యుల్ని ఏర్పాటుచేసి పెట్టలేదు. అందుకని మా అమ్మానాన్నా

పోయేక, అచలపతిని  సిటీకొచ్చి నా కుడిభుజంగా (నాది కుడిచేతి వాటం) ఉంటూ, నా పనులు చేసిపెట్టమని  అడిగేను. నాన్నగారి ఎస్టేటు వ్యవహారాలు ఇతరులకు అప్పగించి నాకు చేదోడు వాదోడుగా నాతోనే  ఉంటున్నాడు.  నాకూ  అతని సాహచర్యం బాగుంటుంది కానీ అతని కారణంగా నా పరపతి  తిరపతి కెళ్లిపోతోందని గమనిస్తున్నాను. అతను లేకపోతే నేను అసలు ఎందుకూ  కొరగానన్న అభిప్రాయం  అఖిలాంధ్ర ప్రజల్లో బలపడుతోందని   గ్రహించేను.

అందుకే అవేళ మా ఇంటిపక్కాయనను వదలదల్చుకోలేదు. గత అయిదారేళ్లుగా మా ఇంటిపక్కనే ఉంటున్నాడు కాబట్టీ,  ఆయన భార్యదీ మాదీ ఒకే ఊరు కాబట్టీ, ఒకరి సంగతి ఒకరు ఎరిగున్నవాళ్లం కాబట్టీ,  'సలహాదేముంది,  నేనూ ఇస్తాను, రండి' అంటూ అప్యాయంగా ఆహ్వానించేను. మలయాళ సినిమాకనెళ్లి  వెండితెర మీద తెలుగు  పౌరాణిక  చిత్రం చూసి  తెల్లబోయిన కుర్ర ప్రేక్షకుళ్లా మొహం పెట్టి 'అబ్బే, మీ కెందుకు శ్రమ' అంటూ  జారుకొనబోయాడు.

నాకు చికాకేసింది.  స్వయంగా శివుడు ప్రత్యక్షమయి వరమివ్వబోతే  'నందీశ్వరుడి చిరునామా చెప్పి పుణ్యం కట్టుకోండి' అని భక్తుడు బతిమాలితే  శివుడికి  చికాకు వేయదూ!? నా ముఖంలో చికాకు పసిగట్టాడేమో, ఆయన దేవుడికి ఒకసారి  మనసులో దణ్ణం  పెట్టుకొన్నట్టు కళ్లు రెప రెప లాడించి  లోపలికి  వచ్చేడు.  చెట్టు కింద ప్లీడరు కష్టాలే  మన దృష్టికి  వస్తాయి కానీ అతను ఆకర్షిద్దామని చూసే  క్లయింట్ల కష్టాలు మనం పట్టించుకోము చూశారా! నా లాటి వాళ్లు  లేకపోతే  దేవుడి సంగతి క్రమంగా మర్చిపోరూ!

ఆయన  ఉపక్రమించేడు,  "మా  అబ్బాయితో పెద్ద గొడవొచ్చి పడింది. వాడికి సినిమా పిచ్చి జాస్తి లెండి.."

నేనతనికి ధైర్యం నూరిపోయడానికి "సినిమా పిచ్చికేముంది?  సినిమా అనేది వినోదంతో బాటు విజ్ఞానం కూడా  అందించే  సాధనమే  కాకుండా.."  అని మొదలుపెట్టాను. 'సినిమాలు –లాభ నష్టములు' అన్న వ్యాసం చిన్నప్పుడు స్కూల్లో నేర్చుకోవడం ఇప్పుడెంతో ఉపకరించింది.

ఆయన జుట్టు పీక్కోవడం మొదలెట్టేడు. జుట్టు  అంత  ఎక్కువగా  ఉందని ఆయన ఫీలవుతుంటే సుబ్బరంగా ఏ కేశవర్ధని  తైలమో రాసుకుని బట్టతల రప్పించేసుకోవచ్చు

కదాని సలహా ఇవ్వబోతుంటే ఆయన ట్రాఫిక్ కానిస్టేబుల్లా చెయ్యెత్తి నన్నాపి కబాడిలో తరుముకూత పట్టినవాడిలా గబగబా ఒప్పజెప్పేసాడు...

"సినిమాపిచ్చి అంటే అలాటిదీ, ఇలాటిదీ కాదు. ప్రతీకారం సినిమాలు చూసి, చూసి ఆ హీరోలతో మమేకమయిపోయి తనూ వాళ్లలాటి వాడినని నమ్ముతున్నాడు. మేం శుబ్బరమైన పేరు పెడితే అది మార్చేసుకొని తన అభిమాన హీరోలు ఇద్దరి పేర్లు కలిపి 'మిత జీవి' అని మార్చుకున్నాడు.

"వాడి నమ్మకం ప్రకారం – వాడొక జమీందార్ల బిడ్డట. చిన్నతనంలో తన కుటుంబాన్ని సర్వనాశనం చేసిన ముగ్గురు దుర్మార్గులను కళ్లారా చూసేడుట. వీడెలాగో బతికి బయటపడితే మేం వాణ్ని రక్షించి స్వంతబిడ్డలా సాకుతున్నాంట. ఏదో ఒక రోజూ మా ద్వారా నిజం వెల్లడై, తన కుటుంబాన్ని గుర్తు పట్టి , ఈ ముగ్గుర్నీ ఒకరొకరుగా చంపి, పగ సాధించి వాళ్ల తండ్రి ఆత్మకు రక్తతర్పణం చేస్తాడట, విన్నారా?" ఆగి గుక్క తిప్పుకున్నాడాయన.

"పోనీ మీరు నిజం వెల్లడించకండి. ఇక గొడవే ఉండదు" అన్నాను నేను సింపుల్‌గా సమస్య పరిష్కరిస్తూ.

"నిజం వెల్లడించడమేమిటండీ నా బొంద, వాడు మా పిల్లాడే అయితేనూ.. వాడికి ఈ భూతం పట్టిన దగ్గర్నుంచీ మా మానాన మమ్మల్ని బతక నివ్వటంలేదు. చాటుగా మా ఇద్దరి మాటలూ వింటూంటాడు – ఏ క్షణంలోనైనా 'బాబు మన స్వంత బిడ్డ కాకపోయినా..' అని అంటామేమో, వెంటనే గదిలోకి వచ్చి ఆశ్చర్యపడి, 'ఇన్నేళ్ళూ ఈ రహస్యాన్ని ఎందుకు దాచేరమ్మా" అంటూ కుమిలిపోదామని...!

"ఇలా కొన్నాళ్లు ఓపిక పట్టి, ఈ మధ్యే అభయమివ్వడం కూడా ఆరంభించేడు. 'నిజం చెప్పేయండి, మీరు మా ఇంట్లో వంటవాళ్లో పనివాళ్లో అయ్యుంటారు. నన్ను కాపాడినందుకు కృతజ్ఞతా పూర్వకంగా మిమ్మల్నేమీ అననని హామీ ఇస్తున్నా' అని. రాబోయే ఆస్తిలో చిన్న వాటా ఇస్తానని ఆశ పెడుతున్నాడు కూడా. వీడి నెలా దారికి తేవాలో తెలియడం లేదు" అంటూ కళ్లనీళ్లు పెట్టుకొన్నాడు.

నేను ఆయన భుజం తట్టి, అతని సంగతి నాకొదిలేయమని చెప్పి పంపేశాను. ఆ మితజీవితో నాకు సత్సంబంధాలే ఉన్నాయి. అప్పుడప్పుడు కిళ్లీకొట్టు దగ్గర అతని బకాయిలు తీర్చడానికి పదీ, పరకా డబ్బులిస్తుంటాను. నేను చెప్పినది శ్రద్ధగా వింటాడని నాకు నమ్మకం ఉంది.

ఇటువంటి చిత్త భ్రమానందరావులతో జాగ్రత్తగా వ్యవహరించాలి. ఉదాహరణకి గుంటూరి షాంపేన్ శర్మ పద్యపఠనం గావించి మత్తెక్కిన ఓ అప్పారావు దీనికి సర్టిఫికేటిచ్చిన శ్రీశ్రీ ఎవరో తెలుసా? నేనే!" అన్నాడనుకో. మనం కాదని వాదించకూడదు. ఒప్పేసుకొని 'నీవు శ్రీశ్రీ వే, మా కోసం అప్పారావులా కాస్సేపు నటించకూడదూ' అంటే సరేనంటాడు. అలా కాకుండా 'ఏడిశావు అప్పారావువే' అని నిజం చెప్పబోతే బిర్ర బిగుస్తాడు.

ఆ సాయంత్రం అచలపతికి మితజీవి సమస్య తెలియబరచి ఈ ఆలోచనా ధోరణితో దాన్ని పరిష్కరించబోతూన్నానని చెప్పినప్పుడు, అతను విభేదించాడు –

"ఇదొక సమస్య కాదని నా అభిప్రాయం సర్, ఇంగ్లీషులో ఎడోలసెన్స్, తెలుగులో కౌమారప్రాయం అనబడే ఈ దశలో వచ్చే అనే వికారాల్లో ఇదొకటి. క్రమేణా అదే సర్దుకొంటుంది. సాధారణంగా యువకులు ఈ వయస్సులో కొండల్ని పిండి చేస్తామనీ లోకాన్ని మరమ్మత్తు చేస్తామనీ అంటారు. కానీ ఆ దశ దాటగానే ఎలా దంచినా కొండలు పిండి కావని గ్రహించి వాళ్లే వ్యవస్థలో భాగమయిపోయి, దాని కొమ్ము కాస్తారు..."

"అచలపతీ, ఈసారి నీ బ్రెయిన్ స్కాన్ చేయించుకొన్నప్పుడు చూసుకో– గ్రేసెల్స్ రంగు నెరిసిపోయుంటాయి. తలకాయ ఎక్కువ ఉపయోగించడం వల్ల అరుగుదల, తరుగుదల జరిగి ఉంటాయి. ఉష్ట్రకోడిలా పాలు తాగుతూ చుట్టూ లోకాన్ని పట్టించుకోకపోతే ఎలా?"

"ఉష్ట్రపక్షీ, నిప్పుకోడీ, కళ్లు మూసుకొని పాలు తాగేపిల్లి అన్నీ మీ వాక్యంలో తలో చోటూ చూసుకొన్నాయనుకొంటాను సార్ .."

"చూసావా, లోకం వేగంగా తిరగటం మూలాన, భావాలూ, పదాలు ఒకదానిపై ఒకటి ఎలా దొర్లిపోతున్నాయో! నీవింకా ఉన్న చోటే ఉండిపోయి పాత సిద్ధాంతాలే వల్లిస్తున్నావు. ఈ మితజీవిని ఇలాగే వదిలేస్తే అతి త్వరలోనే అమిత జీవి అయిపోతాడు. అందుకే నా ప్లాన్ కి అడ్డు రాకుండా......"

"మీ ఇష్టం సార్ " అంది ముద్దకట్టిన వినయం.

"ఆ అబ్బాయి జన్మరహస్య కథని తయారుచేసి ఉంచుకొన్నాను. 'అదంతా ఒక పెద్ద కథ నాయనా!' అని మొదలుపెట్టడానికి సరైన ఒక ఉపోద్ఘాతం కావాలి కాబట్టి ఓ పని చేద్దాం. అతనికి కబురంపించు. సరిగ్గా అతను వచ్చేసరికి నాకు సైగ చేస్తే

చాలు ‘ఆ మాట కొస్తే మన ఇంటి పక్కబ్బాయిని మాత్రం ఇప్పుడు పెంచుతున్నవాళ్లు స్వంతబిడ్డలా చూసుకోవటం లేదూ’ అంటాను. ఆ తర్వాత సంగతి నా కొదిలేయ్! రైట్!?”

“మీరు చెప్పినట్టే జరుగుతుంది సర్!”

అలాగే జరిగింది. ఆ అబ్బాయి నేననుకొన్నట్టుగానే నా మాటలు విని నన్ను బతిమాలేడు– తన జన్మ రహస్యం చెప్పమని. కొంత బెట్టు చేసి చెప్పేశా – మా ఊరికి పక్క ఊర్లో ఉన్న జమీందారిక కుటుంబానికి అతను వారసుడనీ, దుండగులు వాళ్ల ఆస్తినీ ప్లస్ మనుష్యులనూ నాశనం చేస్తే నేనే అతన్ని కాపాడి, వాళ్ల ప్రస్తుత పెంపుడు తల్లిదండ్రులకు అప్పచెప్పేనని!

కుర్రాడు వెంటనే నమ్మాడు, చాలా తృప్తి పడ్డాడు. “మరి ఆ దుండగులో..” అన్నాడు కాస్సేపటికి. దానికీ నా దగ్గర సమాధానం రెడీగా ఉంది. “అందులో ఒకడి చేతికి అరో వేలుంది. మరొకడికి కుడి మోచేతి మీద ఉలిపిరికాయ, మూడోవాడికి అస్తమానూ ముక్కు తుడుచుకునే అలవాటూ ఉన్నాయి”.

“వాళ్లిప్పుడు ఎక్కడ ?” మితజీవి గొంతులో ఆతృత.

“వాళ్ళంతా చచ్చిపోయేరు; వాటాలు తెగక ఒకళ్లతో మరొకరు పోట్లాడుకొని అందరూ చచ్చిపోయేరు. నువ్వు ప్రతీకారం తీర్చుకునేందుకు ఎవ్వరూ మిగలలేదు. అందుకని..”

నా కథ మొదటి భాగం నమ్మాడు కాబట్టి, ఇదీ నమ్మక తప్పలేదు. అయినా అడిగేడు – “నిజంగానా?”

“నిజంగానే – శివాజీ గణేశన్ మైలుకి తక్కువ డైలాగు చెప్పినంత ఒట్టు. ముళ్లపూడి వెంకట రమణ దీర్ఘోపన్యాసం ఇచ్చినంత ఒట్టు.”

అతను ముఖం వేలాడేసుకొన్నాడు.

“అయితే ఇక ఇంటికెళ్లి బుద్ధిగా చదువుకోమనే చెప్పబోతున్నారా?” అన్నాడు వెళ్లిపోతూ.

నాలుగు రోజుల తర్వాత మా ఇంటి పక్కాయన వచ్చి, వాళ్లబ్బాయి అలాటి సినిమాలు చూడడం మానేసేడని చెప్పినప్పుడు అచలపతి కేసి నేను గర్వంగా నవ్వినప్పుడు నాకు తెలియదు – చిరతపులి మచ్చ, ఆజన్మప్రతీకారి కచ్చ ఎప్పటికీ పోవని.

పదిరోజుల తర్వాత మితజీవి వచ్చి నా ఎదురుగా విలాసంగా కూర్చుని, నా

టేబుల్ మీద కాళ్లు పడేసి, అర్జంటుగా సిగరెట్టు ముట్టించి పొగలోంచి నన్ను చూస్తూ, 'నా కంతా తెలిసిపోయింద'న్నాడు. సత్యజిత్‌రాయ్ సినిమా ప్రేక్షకుల్లా నేను అయోమయంగా చూసేను.

'ఏమిటిదంతా' అనడానికి నా పెదాలు కదలబోతుంటే, అతను చెయ్యెత్తి ఆపి, "నన్ను పూర్తిగా చెప్పనియ్యి, నాకు తెలిసిపోయింది, నువ్వే నా అసలు తండ్రివి! మా అమ్మదీ, మీదీ ఒకే ఊరు, మీ ఇద్దరూ ప్రేమించుకున్నారు. నేను కడుపున పడ్డాను. అంతస్తుల్లో తేడా కారణంగా పెద్దలకు దడిసి, మా అమ్మను పెళ్లాడలేకపోయేవు. గతిలేక మా నాన్నను పెండ్లాడి, నాకొక తండ్రిని ఏర్పాటు చేసింది మా అమ్మ. గతాన్ని నా నుండి దాచింది. అయినా, నువ్వే నా తండ్రివని నాకు తెలిసిపోయింది .."

"వాటీజ్ దిస్ నాన్సెన్స్?" అరిచేను, అదేమిటో ఇటువంటివి ఇంగ్లీషులో అంటేనే బాగుంటాయి.

".. నాకెలా తెలిసిందనా నీ అనుమానం? సింపుల్ లాజిక్. మా అమ్మను మరువలేక నువ్వు బ్రహ్మచారిగా మిగిలిపోయావు. మేం ఈ ఊరికి రాగానే మీ ఇంటి పక్కనే ఇల్లు తీసుకొనేట్లు ఏర్పాటు చేసావు. నన్ను చూసి మురిసిపోయి కిళ్లీ కొట్టు దగ్గర అప్పులు తీర్చావు. ఇంతెందుకు? ఇంత బద్ధకస్తుడి వయ్యుండీ నా గురించి శ్రద్ధ తీసుకొని, నన్ను తృప్తిపరచడానికి ఓ కట్టు కథ అల్లి చెప్పావు. కానీ నా సిక్స్త్ సెన్స్ తప్పు లేదు– నేను జమీందార్ల వంశాంకురాన్నే. కానీ ఇన్నాళ్లూ ఎదురుగా ఉన్న నువ్వే ఆ జమీందారువని తెలుసుకోలేకపోయాను.

"కాని మిస్టర్ అనంత్, నువ్వొక పిరికివాడివి. నీ స్వంత కొడుకుని బహిరంగంగా 'వీడు నా కొడుకని చెప్పుకోలేని భయస్తుడవు. అందుకే నీ మీద పగబట్టేను. మొన్న చూసిన సినిమాలో హీరోలా ఎన్నో ఎత్తులూ, జిత్తులూ వేసి – నీ ఆస్తినీ, పరువునీ, ప్రతిష్టనూ నష్టపరుస్తాను. అప్పటి వరకూ నేను నిన్ను 'నాన్నా' అనిగాని 'అంకుల్' అని గానీ పిలవను. వస్తా. మిస్టర్ అనంత్ .." అని వెళ్ళబోతూ, డ్రమటిక్‌గా వెనక్కి తిరిగి, "ఒక్కమాట. నా షరతులకు మీరు రేపే ఒప్పేసుకోకూడదు. కనీసం ఒక్క నెల్లాళ్లయినా అగి, నాకు ప్రతీకారం తీర్చుకునే అవకాశం ఇవ్వాలి, తెలిసిందా!" అన్నాడు.

నోరు పెగిలాక, "అచలపతీ, అంతా విన్నావు కదా! ఈ ఎత్తులూ, జిత్తులూ ఏమిటో నీకేమైనా తెలుసా?" అన్నాను.

అచలపతి సమాధానంతో సిద్ధంగా ఉన్నాడు. “ఇటీవల వచ్చిన కొన్ని సినిమాల టెక్నిక్‌ను మీ విషయంలో అన్వయిస్తే అతను మీ భూముల నుండి, ఇళ్లనుండి, కంపెనీ వాటాల నుండి మీ వారసుడనని చెప్పుకుని, లేదా బెదిరించి డబ్బు వసూలు చేసుకుని మిమ్మల్ని త్వరలో నిరుపేదను చేస్తాడు. అది మామూలు భాషలో ‘మోసం’ అయినా, వాళ్ల అమ్మకు మీరు చేసిన ద్రోహానికి ప్రతీకారంగా చేస్తున్నాడు కాబట్టి జనాలు తప్పుబట్టరు. మీరు అతని వద్దకు ఆఖరిపోరాటానికి స్వయంగా వెళ్లినప్పుడు, మిమ్మల్ని ఓడించినా తని తల్లి ముఖం చూసి మిమ్మల్ని క్షమించినప్పుడు కేరింతలు కొడతారు.”

ఇలాటి పరిస్థితుల్లో ఇంగ్లీషువాడు వాడి ‘గ్రేవ్’ వాడే తవ్వుకున్నాడంటాం. తెలుగువాడు ‘తన గొయ్యి తనే తవ్వుకున్నాడం’టాం. నా పరిస్థితి వర్ణించడానికి ఇంగ్లీషువాడు దిగి రావల్సిందే! ఎందుకంటే గొయ్యి మొక్కలకో, మరోదానికో దేనికైనా తీయవచ్చు. సమాధి అని ఖచ్చితంగా చెప్పలేం కదా! అందువల్ల మరో ఉపమానం వెతకాలి.

“అచలపతీ, నాలాగ తను కూచున్న కొమ్మను తనే స్వయంగా నరుక్కొన్నవాడు ఎవడో ఉండాలి కదా, ఎవడోయ్ వాడు?”


“కాళయ్య సర్, అతనే ఉత్తరోత్రా కావ్యాలు అవీ రాసేసి కాళిదాసు అయిపోయాడు. అంతా కాళికాదేవి దయ అంటారు.”

‘ఈ మితజీవి దయ వల్ల నేను మాత్రం ఖాళీదాసు అవడం ఖాయం’ అని స్వగతంలోనే అనుకుని ఈ గండం గడిచేదెలా అని దీర్ఘంగా ఆలోచించి ఇక అచలపతిని లౌక్యంగా రంగంలోకి దింపాలని నిర్ణయించాను.

“చూడు అచలపతీ, నువ్వు సమాజాన్ని స్టడీ చేస్తున్నానంటావు కదా, నీకో రిడిల్, ఒకటోరకం చిక్కుప్రశ్న ఇస్తున్నాను. అది నువ్వెలా సాధిస్తావో నేను గమనిస్తానన్నమాట.. ఐ విల్ వాచ్ యువర్ పెర్‌ఫామెన్స్.. ఊ..ఏమివ్వను.. (కొంచెం ఆలోచించినట్లు అభినయించడానికి కాస్త విరామం)... సరే, ఈ మితజీవి కేసే ఇస్తున్నాను. ఎలా నెగ్గుకొస్తావో చూతాం.”

“సరే సర్, వారం రోజుల్లో ఫలితాలు మీముందుంటాయ్” అన్నాడు పరీక్షార్థి నిర్వికారంగా!

చూశారా, నా ఆత్మగౌరవం చెడకుండా, తనను ఉపయోగించుకుంటున్నానని అచలపతికి తెలియకుండా సమస్యను ఎలా పరిష్కరించానో! అవునండీ, నిజంగానే పరిష్కరించాను.


సుమిత్ర

పాపం, అచలపతి ఉత్సుకత బహిరంగంగా ప్రదర్శించకపోయినా, నా రిడిల్ విషయం నిజమని నమ్మేశాడు. పరీక్షకెళ్లే పిల్లాడిలా మితజీవి గురించి సమాచారమంతా సేకరించి, అతనికో ప్రియురాలుందని తెలుసుకుని ఓ ఆకాశరామన్న ఉత్తరం రాసిపడేశాడు – 'ఇలా నీ ప్రియుడు అక్రమ సంబంధం ద్వారా పుట్టినవాడని తెలుస్తోంది కాబట్టి కాస్త ముందూ వెనకా ఆలోచించి మరీ పెళ్లాడ'మని!

దాంతో ఆ అమ్మాయి మండిపడుతూ వచ్చి మితజీవిని నిలదీస్తే ఇతను నీళ్లు నమిలాడు. (చెయ్యెత్తి ఆపడంలోనూ, నీళ్లు నమలడం లోనూ ఇతనిదంతా తండ్రి పోలికే!). హీరోయిజమ్ పోజులెలాగున్నా, ప్రియురాలు చేజారిపోతుందని భయపడి, 'తాను నికార్సయిన సాధారణమనిషిననీ, ఏ జమీందారీ కుటుంబంతోనూ సంబంధాలు లేవనీ, పగ సాధించే ప్రయత్నంలో ఆమెను వితంతువును చేసే ప్రమాదం రాకుండా ఎవరి మీద పగ పెట్టుకోననీ, వాళ్ల అమ్మ కూడా ఏ గత చరిత్రలేని మామ్మూలు అమ్మలక్క' అనీ ఒట్టేసి చెప్పి సాదాసీదాగా అయిపోయేడు. ఇంకేం, వాళ్ల అసలు నాన్న, ఆరోపించబడిన నాన్న (అనగా నేను) ఇద్దరం గట్టున, ఆ పైన సుఖాన పడ్డాం.

అచలపతి ఐడియాకని మీరు మార్కులు ఇవ్వవలసిన పని లేదు. ఓ టీము లీడరుగా అతన్ని బుద్ధిని ప్రేరేపించినదెవరు? అది చూడాలి. ఎంబీయేలు మనముందు బలాదూర్ అని మీరొప్పుకోవాలి. నందీశ్వరుడు నందీశ్వరుడే, నందిని ప్రేరేపించగలిగే ఈశ్వరుడు ఈశ్వరుడే! కానీ మనుష్యులు అజ్ఞానులు. చిల్లరరాళ్లకే మొక్కుతారు. జరిగినదానికి మా ఇంటిపక్కాయన నాకు థ్యాంక్స్ చెప్పకపోగా, అచలపతికి కొత్త చొక్కా కుట్టించాడు. కృతఘ్నుడు!

